సాక్షి కర్నూలు

సోమవారం : 9 : జూన్ : 2025



శ్రీమఠంలో భక్తుల సందడి

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. భక్తుల పుణ్యస్నానాల ఆచరించి రాఘవేంద్రుల మూల బృందావన దర్శనం చేసుకున్నారు.



గోసంరక్షణ నిధికి విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న గోసంరక్షణ నిధి పథకానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన టి.మహేష్‌రెడ్డి రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,601.71
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 23.587
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,495
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 250

మంత్రి అనుచరుడా.. మజాకా!

- కర్నూలు కార్పొరేషన్‌లో షాడో మంత్రి!
- ఫోన్లో అధికారులకు ఆదేశాలు
- ఫీల్డ్‌లో అభివృద్ధి పనుల తనిఖీ
- పాలనా పరమైన అంశాలపై వాట్సాప్ చాటింగ్
- ఉన్నతాధికారులకు మించి హడావుడి చేస్తున్న మంత్రి అనుచరుడు



కర్నూలు (టౌన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతోంది. కర్నూలు నియోజకవర్గానికి మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నా ఆయనకు అనుచరులుగా నలుగురు అధికార పార్టీకి చెందిన ప్రైవేటు వ్యక్తులు వ్యవహరిస్తున్నారు. అలాగే ప్రతి వార్డులో పార్టీ తరఫున ఇన్‌చార్జ్‌లను నియమించారు. మంత్రి ఆదేశాల మేరకు వీరందరికీ నగర పాలక సంస్థ యంత్రాంగం ప్రొటోకాల్ ఏర్పాటు చేసింది. కర్నూలు నియోజకవర్గంలోని 33వ వార్డుల పరిధిలో ఏ ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించినా వీరికి తప్పనిసరిగా మున్సిపల్ అధికారులు తెలియ జేయాల్సి ఉంటుంది. ఇంత వరకు బాగానే ఉంది. అయితే మంత్రికి సన్నిహితంగా ఉండే వ్యక్తి కార్పొరేషన్‌లో అన్ని వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నాడు. రాత్రి 10 గంటలు దాటినా అధికారులకు ఫోన్లు చేస్తున్నాడు. ఇప్పటికిప్పుడు పనులు కావాలన్న ఆదేశాలతో మున్సిపల్ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయన హడావుడి చూస్తే ఉన్నతాధికారికి మించి చేస్తున్నారని మున్సిపల్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ఒత్తిడి

ముఖ్యమైన అధికారుల వద్ద మంత్రి అనుచరుడు గంటల కొద్దీ కూర్చోవడంతో పనులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఎప్పటికప్పుడు ఫైళ్లు క్లియర్ కావడం లేదు. ముఖ్యమైన పని ఉంటే వెళ్లవచ్చు.. కానీ అదేపనిగా కలుస్తుండటంతో ఇబ్బందులు వస్తున్నాయని ఇంజినీరింగ్ అధికారి వాపోయారు. ఓ రకంగా మంత్రి అనుచరుడు షాడో మంత్రిగానే వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కన్నా ఇప్పుడు వచ్చిన కూటమి ప్రభుత్వంలో చోటామోటా నాయకుల ఒత్తిడి పెరిగిపోయింది. దీంతో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే ఓ అధికారి వెల్లడించారు.

'వెంకటరమణ కాలనీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సెక్రటరీ సక్రమంగా పనులు చేయడం లేదు. వీరిపై చర్యలు తీసుకోండి. వెంటనే వారిని ఇతర శానిటేషన్ డివిజన్‌కు పంపించండి' అంటూ మంత్రి నియమించిన ఓ ప్రైవేటు వ్యక్తి కమిషనర్ రవీంద్రబాబుకు, నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డికి మేసేజ్ పంపించారు.

'ఏపీఎస్‌పీ క్యాంపులో లైట్లు ఏర్పాటు చేయాలని చెప్పాం. స్థానికంగా పార్టీ బూత్ ఇన్‌చార్జ్‌లు ఫిర్యాదులు చేస్తున్నారు. వెంటనే ఏర్పాటు చేయండి' అంటూ డీఈఈకి వాట్సప్ సందేశం పంపారు.

పై రెండే కాదు ఎన్నో సందేశాలను కర్నూలు కార్పొరేషన్‌లో అధికారులకు పంపుతున్నాడు. ఆయన ఎవరో కాదు మంత్రి అనుచరుడే! ప్రజాప్రతినిధి కాకపోయినా పెత్తనం చెలాయిస్తుండటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

అతి జోక్యం

కార్పొరేషన్‌లో ఉన్న ముఖ్యమైన అధికారుల గ్రూపుల్లో మంత్రి అనుచరుడు ఉన్నాడు. నిత్యం ఏదో ఒక ఆదేశాలు జారీ చేస్తుంటాడు. ఆదేశాలు జారీ చేయడమే కాకుండా అప్పటికప్పుడు క్లియర్ అయిపోవాలన్న అనధికారిక ఉత్తర్వులు ఇస్తాడు. ఈయన హడావుడితో నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం, పారిశుద్ధ్య విభాగం, రెవెన్యూ విభాగం, ఇంజినీరింగ్ విభాగం ఇలా.. ప్రతి శాఖలో పనిచేసే ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ విభాగంలో అధికారులు ఆయన చుట్టూ తిరిగే పరిస్థితులు ఉన్నాయి. ఫోన్లు చేయడమే కాకుండా వాట్సాప్ చాటింగ్ ఎక్కువ చేస్తున్నాడు. కార్పొరేషన్ కమిషనర్ కన్నా.. ఫీల్డ్‌లో పనులను పర్యవేక్షిస్తుంటాడు. ఎలాంటి సంబంధం లేకున్నా.. ఆయన పర్యవేక్షణ, ఆదేశాలు ఒకటేమిటీ.. ఏకంగా కమిషనర్‌కే ఆదేశాలు జారీ చేసే పరిస్థితి వచ్చింది.



కమిషనర్‌తో కలిసి అభివృద్ధి పనులు తనిఖీ చేస్తున్న మంత్రి అనుచరుడు



ప్రభుత్వ అధికారులతోపాటు అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తూ..

అనధికార తనిఖీలు

''మీతో ఎలా పనిచేయించుకోవాలో నాకు తెలుసు'' అని అధికారులతో మంత్రి అనుచరుడు మాట్లాడుతున్నాడు. పాలనాపరమైన అంశాల్లోనూ జోక్యం చేసుకుంటున్నాడు. అధికారులతో కలిసి నిత్యం కాలనీలలో పర్యటనలు చేస్తుంటాడు. అధికారులకు సూచనల ఇవ్వడంతో పాటు కార్యాలయాలను అనధికార తనిఖీ చేస్తున్నారు. అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఈయన రాజకీయ నాయకుడు కాదు. అయినా మంత్రి అనుచరుడిగా మున్సిపల్ అధికారులపై పెత్తనం చేస్తున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గతంలోనూ ఇవే ఇబ్బందులు...

మంత్రి దగ్గర పనిచేసే ఓ పీఏ గతంలో కార్పొరేషన్‌లో పెత్తనం చేశాడు. మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు ఎదుర్కొన్నారు. అప్పట్లో కమిషనర్ చాంబర్‌లో గంటల కొద్దీ కూర్చొని మాట్లాడేవాడు. కమిషనర్‌ను కలిసేందుకు వచ్చిన అర్జీదారులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం తన అనుచరుడు చేస్తున్న వ్యవహారంపై మంత్రి దృష్టి సారించాల్సి ఉంది. అధికారులపై పెత్తం చేస్తూ ప్రభుత్వ పనుల్లో జోక్యం చేసుకోవడాన్ని అరికట్టాల్సి ఉంది.

న్యూస్‌రీల్

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



కర్నూలు రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కర్నూలు: రైల్వే డీఐజీ సత్య ఏసుబాబు ఆదేశాల మేరకు కర్నూలు రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌తో పాటు వెయిటింగ్ హాల్, పార్సిల్ బుకింగ్ ఆఫీస్, టిక్కెట్ కౌంటర్లతో పాటు వచ్చిపోయే రైళ్లలో కూడా తనిఖీలు చేశారు. కర్నూలు డాగ్ స్క్వాడ్ బృందంతో పాటు పోలీసు బృందాలు ఆయా కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు గంజాయి, కొకెయిన్, హెరాయిన్‌తో పాటు నిషేధిత పదార్థాలు, పేలుడు పదార్థాలు, అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు చేశారు. అనుమానితులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి వ్యక్తిగతంగా అడ్రస్సులు సేకరించి ఆరా తీశారు.

యూరియా వినియోగంపై పరిశ్రమల్లో పరిశీలన



పరిశ్రమను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): పారిశ్రామిక అవసరాలకు యూరియా వినియోగిస్తున్నారా అనే దానిపై వ్యవసాయ శాఖ తనిఖీలు చేపట్టింది. యూరియాను వ్యవసాయానికే కాకుండా వివిధ పారిశ్రామిక అవసరాలకు సైతం వినియోగిస్తుట్లుగా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, సి.బెళగల్ ఏఓ మల్లేష్ యాదవ్ ఒక బృందంగా ఏర్పడి ఆదివారం తనిఖీలు చేపట్టారు. కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేటులోని లలిత లక్ష్మీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్, డిటర్జెంట్ పౌడర్, డిటర్జెంట్ కేక్ తయారీ యూనిట్లను పరిశీలించారు. అయితే యూరియా వినియోగిస్తున్న దాఖలాలు కనిపించలేదని ఏడీఏ సాలురెడ్డి తెలిపారు.

'నైరుతి' మందగమనం

- 13 మండలాల్లో తేలికపాటి వానలు

కర్నూలు(అగ్రికల్చర్): నైరుతి రుతుపవనాలు మే నెలలో ముందస్తుగా పలకరించినప్పటికీ ప్రస్తుతం మందగించాయి. జూన్ నెలతో ఖరీఫ్ సీజన్ మొదలై వారం రోజులు గడిచిపోయినప్పటికీ వర్షాలు నామమాత్రానికే పరిమితం అయ్యాయి. వరుణుడి కరుణ లేకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు 13 మండలాల్లో తేలికపాటి వానలు కురిశాయి. కేవలం 3 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది.

'వక్ఫ్' పరిధిలోకి షాహి జామియా మసీదు

- టీడీపీ నాయకుడు గుజ్రీ రౌఫ్‌కు ఎదురు దెబ్బ

ఆదోని రూరల్: పట్టణంలోని షాహి జామియా మసీదును వక్ఫ్‌బోర్డు ఆధీనంలోకి తీసుకుని నిర్వహణను చేపట్టవచ్చని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ మసీదు నిర్వహణకు 2015లో ఎన్నికలు జరగగా టీడీపీకి చెందిన మైనార్టీ నాయకుడు గుజ్రీ రౌఫ్ వర్గం గెలుపొందింది. ఈ ఎన్నికల్లో నిబంధనలు పాటించలేదని మరో వర్గం అయిన ఎజాజ్ అహ్మద్, సలావుద్దీన్‌లు కోర్టుకు ఎక్కారు. ఇందుకు విరుద్ధంగా 2015కు ముందు మసీదు నిర్వహణ లెక్కల్లో అవకతవకలు ఉన్నాయని ఎజాజ్, సలావుద్దీన్‌పై గుజ్రీ రౌఫ్ వర్గీయులు కోర్టుకు వెళ్లారు. దీంతో కేసును ద్విసభ్య ధర్మాసనానికి బదిలీ చేశారు. మసీదును వక్ఫ్‌బోర్డు ఆధీనంలోకి తీసుకుని నిర్వహణను చేపట్టవచ్చని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చింది. దాదాపు పదేళ్లు అయినా ఎన్నికలు జరగకపోవడంతో గుజ్రీ రౌఫ్ ఇష్టారాజ్యమే చెల్లుబాటు అవుతూ వచ్చింది. కోర్టు తీర్పుతో ఆయనకు ఎదురు దెబ్బ తగిలింది.



ఆదోనిలోని షాహి జామియా మసీదు

ప్రశ్నించే గొంతు నొక్కే కుట్ర

- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి



ఆలూరు: కూటమి ప్రభుత్వ అవినీతి, అక్రమాలను వెలికితీస్తున్న సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడి ప్రశ్నించే గొంతు నొక్కే కుట్ర పన్నుతున్నారని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి విమర్శించారు. ఆదివారం ఆయన హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పత్రికా కార్యాలయాలపై దాడికి పాల్పడి భయపెట్టాలని చూడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్నాళ్లు పాలన కొనసాగిస్తారన్నారు. ఎన్నికలకు ముందు అధికార దాహంతో సాధ్యం కాని సంక్షేమ పథకాలను సూపర్ సిక్స్ పేరుతో హామీ ఇచ్చి, వాటిని అమలు చేయకుండా విస్మరించడం దారుణమన్నారు. ఏడాది కూటమి పాలన పూర్తవుతున్నా ఇప్పటివరకు పథకాల జోలికి వెళ్లలేదన్నారు. పథకాల అమలుపై నేడు, రేపు అంటూ సీఎం చంద్రబాబు నాయుడు కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేయడం బాబుకే సాధ్యమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించి హత్యలు, మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు చోటు చేసుకుంటున్నాయన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం

దేవనకొండ: పోలీస్‌స్టేషన్ ఎదుట కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన షేక్షావలి(26) అనే యువకుడు ఆదివారం సాయంత్రం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఓ మహిళపై దాడి చేశారనే ఫిర్యాదుతో షేక్షావలిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు కూర్చోబెట్టారు. 'సీఐ సార్ లేడు మరలా సోమవారం రావాలి' అని అక్కడి పోలీసులు చెప్పారు. పోలీస్‌స్టేషన్‌కు రావడం అవమానంగా భావించిన షేక్షావలి మనస్తాపం చెంది పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం



కర్నూలు డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధ్యాయులు

- మాన్యువల్‌గా కాకుండా వెబ్ కౌన్సెలింగ్ ఎలా నిర్వహిస్తారు?
- కర్నూలు డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధ్యాయులు

కర్నూలు సిటీ: మాన్యువల్‌గా కాకుండా వెబ్ కౌన్సెలింగ్‌లో బదిలీలు నిర్వహిస్తూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆరోపించారు. ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నా మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్ కనీసం స్పందించకపోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు డీఈఓ కార్యాలయాన్ని ఉపాధ్యాయులు ముట్టడించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల ఐక్య వేదిక నాయకులు మాట్లాడారు. గతంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో జరిగిన చర్చల్లో ఎస్‌జీటీల బదిలీల కౌన్సెలింగ్ మాన్యువల్‌గానే నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. పాఠశాల విద్య కమిషనర్ ఇచ్చిన మాటను అమలు చేయలేకపోయారని ఆరోపించారు. వెబ్‌కౌన్సెలింగ్‌తో చాలా మంది ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రతి టీచర్ రెండు వేలకుపైగా ఆప్షన్స్ ఇచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల బదిలీల విషయంలో తన మాటే నెగ్గాలి అనే ధోరణిని వీడాలన్నారు.

డీఈఓకు విన్నపం

బదిలీల్లో తమకు అన్యాయం జరుగుతోందని, న్యాయం చేయాలని డీఈఓను కలసి ఎస్‌జీటీ టీచర్లు విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వివిధ దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న తమకు ప్రాధాన్యత కేటగిరీ విభాగంలో పోస్టులను ఎంపిక చేసుకోవాలనే విషయం తెలియదన్నారు. మూడు పోస్టులు కలిగిన స్కూళ్లు జిల్లాలోనే కాదు.. రాష్ట్రంలో ఎక్కడ కూడా లేవన్నారు. అలాంటి స్కూళ్లలో మాత్రమే ప్రాధాన్యత కేటగిరీ పోస్టులను ఎంపిక చేసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారన్నారు. మూడు పోస్టులు గల స్కూళ్లలో కూడా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అని, స్కూల్ అసిస్టెంట్ అని ఇక్కడకు పంపించడంతో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. మెడికల్ సర్టిఫికెట్ పొంది వారికి ప్రాంతానికి దగ్గరగా ఉండే స్కూళ్లలో అవకాశం వస్తుందని అనుకున్నామన్నారు. కానీ ప్రభుత్వం జారీ చేసిన జీవోతో తమకు జరుగుతున్న అన్యాయం జరిగిందన్నారు.

బేరం కుదిరితేనే బదిలీ!

- ఆదోని ఏవో పోస్టుకు రూ.30 లక్షలతో బేరం కుదిరినట్లు విమర్శలు
- ఎమ్మిగనూరు ఏవో పోస్టు విలువ రూ.15 లక్షలపైమాటే
- నేడు బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగుల బదిలీలు కూటమి పార్టీల నేతలకు కాసుల పంట పండించాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పూర్తిగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఆధ్వర్యంలోనే బదిలీల ప్రక్రియ జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ శాఖలో బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు సోమవారం జారీ కానున్నాయి. దీంతో ఉద్యోగుల్లో ఉత్కంఠ నెలకొంది. కోరుకున్న స్థానం దక్కుతుందా లేదా అనే అనుమానాలతో శని, ఆదివారాల్లో వివిధ శాఖల ఉద్యోగులు, అధికారులు గుంటూరు, విజయవాడలో తిష్ట వేసి పైరవీలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. గతంలో రెవెన్యూ, పోలీసు అధికారుల బదిలీల్లో రాజకీయాలు, ముడుపుల బెడద ఉండేది. ఈ సారి వ్యవసాయ శాఖలో కూడా ముడుపుల బాగోతం నడుస్తోంది.

ఆదోనిలో చక్రం తిప్పుతున్న డీలరు...

ఆదోని మండల వ్యవసాయ అధికారి పోస్టు విషయంలో ఆదోనిలోని ఒక డీలరు చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. ఆదోని ఏవోగా అశోక్‌కుమార్‌రెడ్డి దాదాపు 20 నెలలుగా పని చేస్తున్నారు. ఈయన అక్కడే మరో మూడేళ్లు కొనసాగే అవకాశం ఉంది. మొదట్లో ఈయన ఆప్షన్ కూడా ఇవ్వలేదు. ఈ పోస్టుపై కర్నూలు సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న ఏవో ఒకరు కన్నేసి పెద్ద ఎత్తున పైరవీ చేస్తున్నారు. గతంలో ఐదేళ్లకుపైగా పనిచేసిన ఏవో కూడ పెద్ద ఎత్తున పైరవీ చేస్తున్నట్లు సమాచారం. ఏవో పోస్టుకు దాదాపు రూ.30 లక్షల వరకు ముడుపుల ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇదంతా ఒక డీలరు ద్వారా జరుగుతోంది. ఇప్పటికే డీలరు ఖాతాకే అడ్వాన్స్ జమ చేసినట్లు సమాచారం. ఇది వరకు ఆదోని ఏవో పోస్టు కర్నూలు సబ్ డివిజన్‌లో పని చేసే ఏవోకు ఖరారు అయినప్పటికీ చివరికి గతంలో పనిచేసిన ఏవోకే ఆదోని ఏవో స్థానం లభించినట్లు తెలుస్తోంది. దాదాపు రూ.30 లక్షల వరకు ముడుపులు ఇచ్చుకొని పోస్టు సంపాదించుకున్నట్లు వ్యవసాయ శాఖలో చర్చ జరుగుతోంది. ముడుపుల కిందనే ఇంత భారీ మొత్తంలో ఇచ్చుకుంటే అక్కడ వారి అక్రమ ఆదాయం ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. ఆదోనిలోని ఓ డీలరు కూటమి పార్టీల నేతలు ఇచ్చిన అధికారం వల్ల వ్యవసాయ శాఖనే శాసించే స్థాయికి వచ్చారనే విమర్శలు ఉన్నాయి.

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో..

ఎమ్మిగనూరు ఏవో పోస్టుకు రూ.15 లక్షలతో బేరం కుదిరినట్లు సమాచారం. లూప్‌లైన్ పోస్టులకు కూడా రూ. 2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్లు విమర్శలు ఉన్నాయి. కల్లూరు ఏవో పోస్టుకు విపరీతమైన డిమాండ్ ఉంది. కల్లూరు ఏవో పోస్టుకు రూ.25 లక్షలతో బేరం కుదిరినట్లు విమర్శలు ఉన్నాయి. పశుసంవర్ధక శాఖలో కూడా పూర్తి రాజకీయ కోణంలోనే బదిలీలు జరుగుతున్నాయి. పోకల్ పోస్టుల కోసం టీడీపీ, బీజేపీ నేతలకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ముడుపులు ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఈఏపీసెట్‌లో మెరికలు.. మెరుపులు!

- ఫలితాల్లో సత్తాచాటిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు
- నంద్యాల జిల్లా విద్యార్థికి 4వ ర్యాంకు
- కర్నూలు జిల్లా విద్యార్థులకు 12, 21, 23వ ర్యాంకులు

కర్నూలు సిటీ: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విద్య ప్రవేశాల కోసం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యార్థులు మెరిశారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. గత నెల 19 నుంచి 27వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఇందుకు కర్నూలులో 7, నంద్యాలలో మూడు, ఎమ్మిగనూరు, ఆదోనిలలో ఒక కేంద్రం చొప్పున ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో ఇంజినీరింగ్ స్ట్రీమ్‌కు 12,522 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా 11,855 మంది పరీక్ష రాశారు. వీరిలో 8,403 మంది అర్హత పొందారు. అగ్రికల్చర్ స్ట్రీమ్‌కు 6,370 మంది రిజిస్టర్ చేసుకోగా 5972 మంది పరీక్షల రాశారు. వీరిలో 5305 మంది ఉత్తీర్ణులయ్యారు. నంద్యాల జిల్లాలో ఇంజినీరింగ్ స్ట్రీమ్‌కు 5,409 మంది రిజిస్టర్ చేసుకోగా 5205 మంది పరీక్షలకు హాజరుకాగా 3648 మంది ఉత్తీర్ణులయ్యారు. అగ్రికల్చర్ పరీక్షకు 2,849 మంది రిజిస్టర్ చేసుకోగా 2,655 మంది పరీక్షలు రాయగా 2341 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఇవీ ర్యాంకులు..

ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో కర్నూలు జిల్లాకు చెందిన వంగాల అజయ్ రెడ్డి 12వ ర్యాంకు, కప్పట్రాల చెన్నకేశవ 23వ ర్యాంకు, గోరంట్ల సాయి సాహితి 140వ ర్యాంకు సాధించారు. అగ్రికల్చర్ విభాగంలో దాసి హేమ సాగరిక 21వ ర్యాంకు, రాయల గోవర్దన్ చౌదరి 65వ ర్యాంకు, సఫా సైఫ్ ఖ్యురైషీ 90వ ర్యాంకు, పడిగాల దీపిక 102వ ర్యాంకు, మేఘనాథ్ అఖిల్ బాలాజీ నాయక్ 104వ ర్యాంకు, జి.సతీష్ చంద్ర రాయల్ 121వ ర్యాంకు, వాకిటి గురు పరద్వీ 124వ ర్యాంకు సాధించారు. నంద్యాల జిల్లాకు చెందిన విద్యార్థుల్లో యు.రామ్ చరణ్ రెడ్డి రాష్ట్ర సాయిలో ఇంజినీరింగ్ విభాగంలో 4వ ర్యాంకు, పి.ప్రణయ్ రెడ్డి 34వ ర్యాంకు, పి.గురు హర్షిత్ 92వ ర్యాంకు సాధించారు.



తల్లిదండ్రులతో వంగల అజయ్ రెడ్డి

విద్యార్థి పేరు: వంగల అజయ్ రెడ్డి
తల్లిదండ్రులు: వెంకట రమణారెడ్డి, వంగల మాధవి
స్వస్థలం: కర్నూలు, మాధవనగర్
ఏపీ ఈఏపీసెట్‌లో ర్యాంకు: 12వ ర్యాంకు (జేఈఈ అడ్వాన్స్‌డ్ ఓపెన్ క్యాటగిరి 19, ఆల్ ఇండియాలో ఈడబ్ల్యూస్ ఫస్ట్ ర్యాంకు, తెలంగాణ ఎంసెట్‌లో 12వ ర్యాంకు)
లక్ష్యం: ఐఐటీ బాంబే కంప్యూటర్ సైన్స్



పేరు: పబ్బతి ప్రణయ్‌రెడ్డి
తల్లిదండ్రులు: సుధాకర్ రెడ్డి, రాధమ్మలు
ఊరు: పరమటూరు, బండిఆత్మకూరు మండలం
ఏపీ ఈఏపీ సెట్ ర్యాంక్: 34
జేఈఈ అడ్వాన్స్ ర్యాంక్: 182
లక్ష్యం: కాన్పూర్ ఐఐటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్



పేరు: మంచాలమున్ని సాత్విక్‌రెడ్డి
తల్లిదండ్రులు: శ్రీసాయి, సీలిమ
ఊరు: గుర్రెడ్డి కాలనీ, బనగానపల్లె
ఏపీ ఈఏపీ సెట్ ర్యాంక్: 192
జేఈఈ అడ్వాన్స్ ర్యాంక్ : 2000
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



రామచరణ్‌రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న తండ్రి

పేరు: రామచరణ్‌రెడ్డి
తల్లిదండ్రులు: కృష్ణారెడ్డి, రాణి రుద్రమదేవి
ఊరు: తిమ్మాపురం, మహానంది మండలం
ఏపీ ఈఏపీ సెట్ ర్యాంక్: 4
జేఈఈ అడ్వాన్స్ ర్యాంక్: 170
లక్ష్యం: సివిల్స్‌లో ర్యాంక్ సాధించడం



విద్యార్థి పేరు: కప్పట్రాల చెన్నకేశవ
తల్లిదండ్రులు: కె.రమేష్ బాబు, కళ్యాణి కుమారి, టీచర్
స్వస్థలం: పత్తికొండ
ఏపీ ఈఏపీ సెట్ ర్యాంకు: 23వ ర్యాంకు(జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 199వ ర్యాంకు, తెలంగాణ ఎంసెట్ 18వ ర్యాంకు)
లక్ష్యం: ఐఐటీ బాంబే కంప్యూటర్ సైన్స్



విద్యార్థి పేరు: దాసి హేమ సాగరిక
తల్లిదండ్రులు: డి.వెంకట శ్రీహరి బాబు, ఎస్.మంజుల వాణి
స్వస్థలం: రిచ్‌మండ్ విల్లాస రేడియో స్టేషన్, కర్నూలు
ఏపీ ఈఏపీ సెట్ ర్యాంకు: 21వ ర్యాంకు(నీట్‌లో మంచి ర్యాంకు రావొచ్చని అంచనా)
లక్ష్యం: వైద్యురాలుగా రాణించాలని ఉంది.



పేరు: ఎర్రపాపన్న గారి సురేంద్ర
తల్లిదండ్రులు: సుబ్బరాయుడు, శంకరమ్మ
ఊరు: యనకండ్ల, బనగానపల్లె
ఏపీ ఈఏపీ సెట్ ర్యాంక్: 688
జేఈఈ అడ్వాన్స్ ర్యాంక్: 12000
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

తుగ్గలి: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని జొన్నగిరిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన రాంపల్లి సతీష్(25)హైదరాబాద్‌లో చెత్త ఏరుతూ జీవనం సాగిస్తున్నాడు. చెత్త బండి కొనుగోలు, అనారోగ్యంతో ఉన్న తల్లి వైద్యం కోసం రూ.5లక్షల దాకా అప్పులు చేశారు. వాటిని ఎలా తీర్చాలన్న బెంగతో శనివారం రాత్రి ఇంటిపైన ఉన్న రేకుల షెడ్డులో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య భూమిక, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి ఆంజినేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆదివారం తెలిపారు.

జోరుగా నకిలీ విత్తన విక్రయాలు


జోహరాపురంలో విక్రయిస్తున్న లూజు విత్తనాలు

నందవరం : ఆరుగాలం శ్రమించిన రైతన్నకు కష్టాలు తప్పడం లేదు..ఓ వైపు నకిలీ విత్తనాలు..మరో వైపు శ్రమించి పంట పడించిన దిగుడులు లేక, గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వానలు కురస్తుడడంతో రైతులు పత్తి పంట సాగుకు ఉపక్రమించారు. కొందరు దళారులు జోరుగా నాసిరకం, లూజు విత్తనాల విక్రయాలు కొనసాగిస్తున్నారు. అయినా అధికారుల చర్యలు, తనిఖీలు చేయకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం, అధికారులు నకిలీ, లూజు విత్తనాలపై కఠిన చర్యలు తీసుకుని, నాణ్యమైన విత్తనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

లోదుక్కులతో ప్రయోజనాలు


రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త లక్ష్మీప్రియ

అవుకు: భూసార పరీక్షలు, లోదుక్కులతో మంచి ఫలితాలు ఉంటాయని, అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీప్రియ అన్నారు. ఆదివారం అవుకు మండలం సుంకేసుల గ్రామంలో వికసిత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాల శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి అబ్దుల్ హక్‌తో కలిసి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుస్థిర యాజమాన్యం, భూసార పరీక్షలు, సమగ్ర సస్యరక్షణ, పంటల సమయంలో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, లోతు దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. బనగానపల్లె మండలం యాగంటిపల్లెలోని కృషి విజ్ఞాన కేంద్రంలో అందిస్తున్న సేవలను రైతులకు తెలియజేశారు. వర్మీకంపోస్ట్, నాణ్యమైన విత్తనాలు, ట్రికోడెర్మా విరిడీ, వర్టిసిలియం, సుడో మోనాస్, డైరీ ఫామ్, గొర్రెల ఫామ్, కోళ్ల ఫామ్ ప్రారంభించాలనుకునే వారికి శాస్త్రీయ సలహాలు, సూచనలు అందిస్తున్నామని తెలిపారు. అలాగే మహిళలకు కుటీర పరిశ్రమల ఏర్పాటుపై శిక్షణనిస్తున్నామని చెప్పారు. అలాగే కేంద్రం ప్రభుత్వం అందించే పీఎం కిసాన్, పీఎంఎఫ్‌బీవై పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ అసిస్టెంట్ పటాన్ నాయక్, గ్రామ పెద్దలు చంద్రశేఖర్ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

‘మహా’ సమస్యలు!

- మహానందిలో భక్తులకు కనీస సౌకర్యాలు కరువు
- వసతి గదులు, పార్కింగ్ స్థలం లేక అగచాట్లు
- గాల్లో దీపంగా మారిన భద్రత
- వైద్యసేవలకు కానరాని ఆసుపత్రి
- అన్నప్రసాదాలు సరిపోక ఆకలితో అలమటిస్తున్న భక్తులు
- రూ. కోట్లలో ఆదాయమున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు


మహానంది క్షేత్రం


పాడుబడిన మహానంది ఆలయ పూర్వ కార్యాలయం

మహానంది: సాక్షాత్తు పరమేశ్వరుడే ఆవు రూపంలో వెలసిన క్షేత్రం మహానంది. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న ఈ క్షేత్రం దర్శనార్థం దేశ, విదేశాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఏడాదికి రూ. 17 కోట్లకు పైగా ఆదాయం వస్తున్న ఈ క్షేత్రంలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకరోజు బస చేద్దామంటే సరైన గదుల్లేవు. ఆహ్లాదంగా కాసేపు విశ్రాంతి తీసుకుందామంటే పరిసరాలు పచ్చగా కనిపించవు. కడుపు నిండా భోజనం చేద్దామంటే అన్నప్రసాదం పంపిణీ పరిమితమే. ఇలా ఒకటేంటి సమస్యలు కోకొల్లలు. ఏ ఆలయంలో నైనా ఒకటి లేదా రెండు సమస్యలు మాత్రమే ఉంటాయి. కానీ మహానందిలో ఉన్న మహా సమస్యలతో భక్తులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. నేడు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి మహానంది ఆలయానికి వస్తున్న నేపథ్యంలో భక్తులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై కథనం.

అన్నమో...మహానందీశా

ఏ ఆలయానికి వెళ్లినా భక్తులకు సరిపడా అన్నప్రసాదాల పంపిణీ జరుగుతుంది. ఆలయానికి రూ. కోట్ల ఆదాయంతో పాటు అన్నప్రసాద విభాగానికి రూ. 4.45 కోట్లు డిపాజిట్లు ఉన్నప్పటికీ మహానందిలో మాత్రం రోజుకు 200 మందికి, శని, ఆది, సోమవారాల్లో 300 మందికి మాత్రమే అన్నప్రసాదాల పంపిణీ చేస్తున్నారు. ఇందులోనూ నెలకు రూ.లక్ష వరకు వేతనాలు తీసుకునే రెగ్యులర్ ఉద్యోగులు ఇక్కడే భోజనాలు చేయడం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి అన్నప్రసాదాల పంపిణీపై దృష్టి సారించి రోజుకు కనీసం 500 నుంచి 600 మందికి పంపిణీ చేపట్టాలని సుదూర ప్రాంత భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భద్రత కరువు

మహానంది క్షేత్రంలో గతంలో ఉదయం నలుగురు, సాయంత్రం నలుగురు హోంగార్డులు విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఉదయం ఒకరు, మధ్యాహ్నం ఒకరు మాత్రమే విధులు చేపడుతున్నారు. భద్రతా విధులతో పాటు ఉదయం, సాయంత్రం జరిగే అష్ట విధ మహా మంగళ హారతుల సమయంలో ప్రత్యేకంగా విధులు చేయాల్సి రావడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఆలయ ముఖ ద్వారం వద్ద రెగ్యులర్ ఉద్యోగి అంటూ ఒక్కరూ లేరు. దీంతో ఇటీవల తరచూ చోరీలు జరుగుతున్నాయి. కార్తీకమాసం, శివరాత్రి పర్వదినాల్లో వరుస చోరీలు జరిగిన విషయం తెలిసిందే. రాజగోపురం వద్ద ప్రైవేటు టెండరుదారులే ఉండటంతో తనిఖీలు నామమాత్రంగా జరుగుతున్నాయి. ఇక్కడ గతంలో రెగ్యులర్ ఉద్యోగులు విధుల్లో ఉండేవారు.

కానరాని ఆసుపత్రి

మహానంది దేవస్థానం పరిధిలో ఒక్క ఆసుపత్రి లేదు. భక్తులకు అనుకోకుండా ఏదైనా జరిగి వైద్యమవసరమైతే దేవుడే దిక్కు. కొందరు ఇక్కడి కోనేరులో దిగిన తర్వాత మూర్ఛకు గురవుతుంటారు. తర్వాత కోలుకోలేక ఆలయ పరిధిలోనే మృత్యువాతకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ ఆవరణలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు వైద్యాధికారులు అందుబాటులో ఉండేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

వసతికి అవస్థలు

మహానందిలో వసతి గృహాలు చాలా తక్కువగా ఉన్నాయి. దేవస్థానానికి చెందిన టీటీడీ వసతి గృహాల్లో కేవలం 26, నాగనందిలో 12 గదులు మాత్రమే ఉన్నాయి. వసతి గృహాలు తక్కువగా ఉండటంతో ప్రైవేటు లాడ్జీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. దీంతో పాటు పార్వతీపురం కాలనీలో గృహాలే లాడ్జీలుగా తయారయ్యాయి. వీటికి ఎలాంటి అనుమతి లేకపోగా అసాంఘిక కార్యకలాపాలకు ఇస్తూ నెలకు రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. భక్తులు రద్దీ లేని రోజుల్లో రూ. 300 నుంచి రూ. 500 వరకు ఇచ్చే గదులను ప్రతి శని, ఆది, సోమవారాల్లో రద్దీని బట్టి రూ. 1000 నుంచి రూ. 3000 వరకు ఇస్తున్నారు. దీంతో భక్తుల అవస్థలు వర్ణనాతీతం.


మాడ వీధుల్లో ట్రాఫిక్ జామ్

పార్కింగ్ స్థలం లేక పాట్లు

మహానందీశుడి దర్శనార్థం నిత్యం వేలాది మంది భక్తులు వివిధ వాహనాల్లో వస్తుంటారు. ఇదే అదనుగా భావించిన అధికారులు టోల్‌గేట్ల కోసం టెండర్లు నిర్వహించారు. కేవలం ఒక టోల్‌గేట్ టెండర్ ద్వారానే రూ. 1.68 కోట్లు ఆదాయం వచ్చింది. అయితే, భక్తుల వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు మాత్రం ప్రత్యేక స్థలం లేకపోవడంతో వారు తమ వాహనాలను నంది సర్కిల్ చుట్టూ మాడవీధుల్లోనే నిలుపుకోవాల్సి వస్తుంది. దీంతో ఈప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుంది.

బస్‌షెల్టర్ కరువు

మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన భక్తులు బస్సుల కోసం నిలబడేందుకు స్థలం కరువైంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు మహానందీశ్వర స్వామి దర్శనం ముగించుకుని సుదూర ప్రాంతాలకు వెళ్తుంటారు. అయితే, ఆలయ ప్రాంగణంలో బస్సు షెల్టర్ లేకపోవడంతో వారి అవస్థలు భగవంతుడికే ఎరుక.

70 ఏళ్ల నాటి పైపులైన్లే గతి

మహానంది ఆలయ పరిధిలో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు పారిశుధ్య పనుల నిమిత్తం సుమారు 85 మందికి తీసుకుని వారికి వేతనాలు ఇస్తున్నా పనులు మాత్రం అలాగే ఉన్నాయి. 70 ఏళ్ల క్రితం వేసిన మంచి నీటి పైపులైన్లు, కాల్వలే గతి అయ్యాయి. దీంతో ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య లోపం, తాగునీటి సమస్యతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ


మల్లన్న దర్శనానికి క్యూలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మూడు విడతలుగా పలువురు భక్తులు స్పర్శ దర్శనం టికెట్లు పొంది స్వామివారి స్పర్శదర్శనం నిర్వహించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్ని కిటకిటలాడాయి.

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం


దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు ఆదివారం బెంగళూరుకు చెందిన ఎం.మల్లికార్జున రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు హిమబిందుకు అందజేశారు. విరాళాన్ని అందించిన దాతకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డుప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

అటవీ భూమి ఆక్రమణకు యత్నం

పాణ్యం: మండల పరిధిలోని కొండజూటూరు గ్రామంలో అటవీ శాఖ పరిధిలో ఉన్న భూము ల్లో జేసీబీ సహాయంతో పొలాన్ని అక్రమంగా చదును చేస్తుండగా ఆదివారం బీట్ ఆఫీసర్ జమాల్‌బాషాకు సమాచారం అందడంతో ఆ గ్రామానికి చేరుకొని కొండల్లో చదును చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ శాఖ పరిధిలో ఉన్న భూమిని జేసీబీ సహాయంతో మొక్కలను, రాళ్లను తొలగించి చదును చేసుకోవడం జరిగిందన్నారు. ప్రజలు ఇచ్చిన సమాచారంతో అక్కడికి వెళ్లి పరిశీలించామన్నారు. కొండ ప్రాంతాల్లో అక్రమంగా మొక్కలను తొలగించి చదును చేసిన వ్యక్తిని విచారించామని, అనుమతులు లేకుండా అటవీ భూముల్లో యంత్రాలతో చదును చేయడంపై అటవీ శాఖ చట్టం కింద కేసు నమోదు చేస్తామన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయితే చదును చేసిన వ్యక్తి అధికార పార్టీలోని ఓ నాయకుడి పేరు చెప్పినట్లు సమాచారం.

బయో మైనింగ్ పనులు పూర్తి చేయండి


గార్గేయపురంలో బయో మైనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగర శివారులోని గార్గేయపురంలో జరుగుతున్న బయో మైనింగ్ పనులు వచ్చే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. ఆదివారం డంప్ యార్డులో బయో మైనింగ్ ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో గార్గేయపురంలోని డంప్ యార్డులో బయో మైనింగ్ ప్రక్రియ చేపట్టారన్నారు. డంప్ యార్డులో 65 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగించేలా చెత్త శుద్ధీకరణ లక్ష్యంగా పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే 43 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలకు బయో మైనింగ్ ప్రక్రియ పూర్తయ్యిందని, మిగిలిన 22 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను వచ్చే నెలాఖరు నాటికి పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ట్రామెల్ యంత్రం ద్వారా చెత్తను నాలుగు పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేస్తారని, ప్లాస్టిక్, ఇనుము, గాజు వస్తువులు, రాళ్ల రప్పలను వేర్వేరు చేయడం జరుగుతుందన్నారు.

నగరంలో తనిఖీలు చేపట్టిన కమిషనర్

అంతకుముందు కమిషనర్ నగరంలో తనిఖీలు చేపట్టారు. ఏ.క్యాంపు, బళ్లారి చౌరస్తా, ఏపీఎస్‌పీ క్యాంపు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. పలు కాలనీల్లో పారిశుధ్య సమస్యలను గమనించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఓ టీ హోటల్ వద్ద అపరిశుభ్రంగా ఉండటంతో నిర్వాహకుడిపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే ఏపీఎస్‌పీ క్యాంపు, బళ్లారి చౌరస్తా వద్ద నూతన బైపాస్ రహదారిని కమిషనర్ పరిశీలించారు.

అనుమతుల్లేకుండా హంద్రీలో తవ్వకాలు

- నది బఫర్‌జోన్‌లో రోడ్డు
- వరద నీరొస్తే కొట్టుకుపోయే అవకాశం
- జల వనరుల శాఖకు కనీస సమాచారం ఇవ్వకుండానే రోడ్డు నిర్మాణం


నది తీరంలో తవ్విన మట్టితో ఏర్పడిన గుంతలు

కర్నూలు సిటీ: నగరం మధ్యలో ప్రవహిస్తున్న హంద్రీనదిలో యథేచ్ఛగా తవ్వకాలు చేస్తున్నారు. నదిలో తవ్విన మట్టిని తీసి అదే నదిలో ఎలాంటి అనుమతులు లేకుండా బఫర్‌జోన్‌లో వేస్తున్న రోడ్డుకు వినియోగిస్తున్నారు. పగలు తవ్వకాలు చేస్తే ఎవరైనా అడ్డుకుండారనే ఉద్దేశంతో రాత్రి సమయంలో జేసీబీతో పని కానిస్తున్నారు. అధికారులు ఏ మాత్రం తమకు తెలియనట్టు వ్యవరిస్తుండడంపై అనేక విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే హంద్రీనది బఫర్‌జోన్‌లో అక్రమ కట్టడాలు నిర్మించడంతో నది కుచించుకపోయింది. నదికి 2007, 2009లో వరదలు రావడంతో తీర కాలనీలు నీటిలో మునిగిపోయాయి. ఇటీవలే నది బఫర్‌జోన్‌లోని కట్టడాలను గుర్తించి నది సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసే పనులను చేపట్టారు. ఇంకా ఇందులో కేసీ కాలువ అక్విడక్ట్ నుంచి జోహరాపురం వరకు ఉన్న హంద్రీనది సరిహద్దులు గుర్తించాల్సి ఉంది. దీనిపై కర్నూలు నగరపాలక సంస్థ అధికారులకు శ్రీశైలం వరద రక్షణ విభాగం ఇంజినీర్లు ప్రతిపాదనలు పంపించారు.

గట్టు కోతకు గురయ్యే ప్రమాదం

కోట్ల కిసాన్ ఘాట్‌కు వెనుకటి భాగం, సిమ్మింగ్ పూల్‌కు ఎదురుగా హంద్రీనదిలో మట్టిని జేసీబీలతో తవ్వకాలు చేస్తున్నారు. భవిష్యత్తులో వరద నీరు ఎక్కువగా వస్తే ఆ గట్టు కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. ఇక్కడ తవ్విన మట్టిని రాజ్‌విహార్‌కి సమీపంలో అంబేద్కర్ భవనం, జెడ్పీ వెనుకటి భాగంలో హంద్రీబ్రిడ్జ్ నుంచి కల్లూరు దర్వాజా వరకు నడక దారిని నిర్మిస్తుంది కర్నూలు నగరపాలక సంస్థ. ఆ దారిని నిర్మించాలను కోవడంలో తప్పేలేదు. కానీ నది పరిరక్షణ చట్టాల ప్రకారం బఫర్‌జోన్ ఎలాంటి కట్టడాలు నిర్మించకూడదనే నిబంధనలను నగరపాలక సంస్థ ఇంజినీర్లు పట్టించుకోకపోవడంపై విమర్శలు ఉన్నాయి. జల వనరుల శాఖ అనుమతి తీసుకోకుండా రూ.50 లక్షలతో నడక దారిని బఫర్ జోన్‌లో నిర్మించవచ్చునా అనే విషయం తెలుసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తుండడంతో నదిలో పెద్ద గుంతలు కనిపిస్తున్నాయి. దీనిపై జల వనరుల శాఖ వరద రక్షణ విభాగం డీఈఈ శ్రీనివాస నాయక్‌ను వివరణ కోరగా నదిలో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు. బఫర్‌జోన్‌లో వేస్తున్న రోడ్డుకు సైతం ఎలాంటి అనుమతులు తీసుకోలేదని చెబుతున్నారు.


బఫర్‌జోన్‌లో రోడ్డు వేస్తున్న దృశ్యం



జీడీపీకి సందర్శకుల తాకిడి

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద ఆదివారం సందర్శకుల సందడి కనిపించింది. బక్రీద్ పండుగను పురస్కరించుకుని గోనెగండ్ల, ఎమ్మిగనూరు, కోడుమూరు తదితర గ్రామాల నుంచి ముస్లింలు కుటుంబసభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ప్రాజెక్టు నీటిలో కొద్ది సేపు సరదాగా ఈతకొట్టారు.

విజ్ఞాన పీఠంలో ప్రవేశాలు

- అనాథ బాలురకు అవకాశం


విజ్ఞాన పీఠంలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని జి.పుల్లారెడ్డి నగర్‌లో ఉన్న విజ్ఞాన పీఠం అనాథ శరణాలయంలో కొత్త విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పీఠం కార్యదర్శి సి.మాణిక్య రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం 40 మంది అనాథ బాలురు పాఠశాలలో చేరారన్నారు. తల్లి దండ్రులు లేని నిరాశ్రితులుగా ఉన్న బీద బాలుర కోసం గత 50 సంవత్సరాలుగా విజ్ఞాన పీఠం వసతిగృహం నిర్వహిస్తోందని చెప్పారు. జి.పుల్లారెడ్డి దానం చేసిన స్థలంలో విశ్వహిందూ పరిషత్, విజ్ఞాన పీఠం అనాథ శరణాలయా న్ని దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ అనాథ శరణాలయంతో పాటు ఎయిడెడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అనాథ బాలురు ఉంటే విజ్ఞాన పీఠంలో చేరవచ్చని కోశాధికారి రంగారెడ్డి పేర్కొన్నారు. ఉచిత వసతి, విద్య, వైద్యం అందిస్తామన్నారు. విజ్ఞాన పీఠం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల దేవస్థానానికి వాహనాల అందజేత


వాహనాల పత్రాలను దేవస్థాన ఈఓకు అందజేస్తున్న కెనరా బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి కెనరా బ్యాంకు వారు బొలెరో మ్యాక్స్ పికప్-1, బొలెరో కంపేర్-1 వాహనాలను విరాళంగా అందజేశారు. ఆదివారం కెనరా బ్యాంకు కర్నూలు ప్రాంతీయ కార్యాలయ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుకాంత్‌కుమార్ శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావుకు వాహనాలను, వాటికి సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ రెండు వాహనాల విలువ సుమారు రూ.21.56 లక్షలకు పైగా ఉంటుందని దాతలు తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు నాగేశ్వరరావు, కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ వెంకటేష్‌గౌడ్, స్థానిక మేనేజర్ హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

‘సర్వే’జనా పెదవి విరుపు!

- కూటమి ఏడాది పాలనపై మార్మోగుతున్న కాల్స్
- ప్రజాభిప్రాయం కోసం నాలుగు ప్రశ్నలు
- ఇప్పుడేమి సర్వే అని పెదవి విరుస్తున్న ప్రజలు

కర్నూలు(అర్బన్): ‘ నమస్కారం.. రాష్ట్రంలో ఒక సంవత్సర కాలం కూటమి ప్రభుత్వ పాలన ఎలా ఉంది ? బాగుంది అయితే 1 నొక్కండి, ఫరవాలేదు అయితే 2 నొక్కండి, బాగోలేదు అయితే 3 నొక్కండి, మళ్లీ వినడానికి 0 నొక్కండి’ అంటూ ఐవీఆర్‌ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) సర్వేకు సంబంధించిన కాల్స్ మార్మోగుతున్నాయి. ఇది ఎన్నికల సీజన్ కాదు, పోనీ ఎక్కడైనా ఉప ఎన్నికలు ఉన్నాయా అనుకుంటే , అవీ లేవు. మరి ఎందుకు ఐవీఆర్‌ఎస్ సర్వే ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారనే సందేహం ప్రజల మెదళ్లను తొలిచేస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైన సందర్భంగా ఇలాంటి కాల్స్ రావడం వెనక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వమే తమ పాలన పట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ఈ సర్వే చేయిస్తుందా? అనే సందేహాన్ని కూడా పలువురు వ్యక్తం చేస్తున్నారు.

హామీల అమలు చేయకపోవడంపై సర్వత్రా వ్యతిరేకత

ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడం పట్ల ప్రజల్లో పూర్తి స్థాయిలో వ్యతిరేకత వస్తోంది. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి నెలా నవరత్నాల పేరుతో ఏదో ఒక సంక్షేమ పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అయ్యేది. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండేవారు. అయితే కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలోనే సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఎలాంటి పథకాలు అమలు కాకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. అయితే తమకు వచ్చే సర్వే కాల్స్‌పై అసంతృప్తిని వ్యక్తం చేయలేని నిస్సహాయ స్థితిలో ప్రజలు ఉన్నారు. ఎందుకంటే ఈ ప్రభుత్వం మరో నాలుగేళ్లు అధికారంలో ఉంటుంది కాబట్టి, కక్ష తీర్చుకుంటుందేమో అనే భయంతో కాల్స్‌కు ఎలాంటి సమాధానం చెప్పకుండా కట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బటన్ నొక్కితే పథకాలు, ఇతర ప్రయోజనాలు కోల్పోతామేమోననే సందేహాన్ని కూడా పలువురు వ్యక్తం చేస్తున్నారు.